కుని కుదిపేసరికి అతని శరీరం నిశ్చలంగా కట్టెవలె ఉండి ఒక పక్కకు వొరిగిపోయింది.

బుచ్చిగాడు ఒక్క క్షణంసేపు భయంతో కొయ్యబారిపోయి నిలబడి తర్వాత వెంకటేశ్వర్లు గుడిసెవైపుకు బాణవేగంతో పరుగుతీశాడు.

* *

# నలుపూ - తెలుపూ...

భయంకరమైన ఎండ నిరంకుశుడైన ప్రభువు పరిపాలనవలె జీవులను క్షోభపెడుతున్నది. వెచ్చనిగాలి ఉండి ఉండి సుళ్ళుగా సుళ్లుగా రేగి అసలే ఎండతో తపించిపోతున్న పాంథుల కళ్ళలో దుమ్ముకూడా కొడుతున్నది. నిరంకుశుడూ, నీచుడూ అయిన ప్రభువు పరిపాలనలో భయాందోళనతో నిత్యమూ దాగివుండే సామాన్యజనులవలె మనుష్యులందరూ ఎండవేడిమికి భయపడి ఎక్కడ నీడవుంటే అక్కడ తల దాచుకుంటున్నారు.

రెండవ అంతస్థులో విశ్రాంతిగా కూర్చునివున్న ముసలాయనకు నిర్జనమైన ఆ వీధిచివరలో ఒక పసివాడు కని

పించాడు. ఆయన కొన్నిక్షణాలు అలే అనిమిష నేత్రాలతో చూశాడు. వాడయిదారేళ్ళ పసివాడు. చేతిలో ఒక గిన్నె వున్నది. ప్రతిఇంటిముందూఆగి "అమ్మా! ఒక్కకబళం వెయ్యి తల్లీ!" అంటూ కేక పెడుతున్నాడు లోపల సుఖంగా, చల్లని వట్టివేళ్ళ తడికలు వ్రేలాడదీయబడిన గదులలో విశ్రాంతి తీసుకునే సంపన్నులకా పసివాడి కేక వినిపించడంకూడా కష్టమే.

ఆ పసివాడి తల అసహ్యాంగా పెరిగింది. ఒంటిమీద వున్న మురికి లాగు చిరుగులుపట్టివుంది. చిక్కిశల్యమై ఎముకలగూడులా వున్నాడు. వాడు ఎంతసేపటినుంచో ఆకలితో, దాహంతో బాధపడుతున్నాడు. వాడి చేతిలోవున్న గిన్నెలో ఏ చల్లనితల్లి ఆ క్రూరమైన ఎండలో ఇంటిబయటికివచ్చి వేసిందో పట్టెడు అన్నంవున్నది. వాడు ఏ వీధి కొళాయి దగ్గరైనా ఆగి ఆ కాస్త అన్నమూ తిందామని అనుకుంటూ వున్నాడు.

ముసలాయన, తను ఇంటిముందు కాలిన పెనంవలె వున్న ఎర్రమట్టి రోడ్డుమీద నిలబడి వాడు "అమ్మా! ఒక్క ముద్ద పెట్టుతల్లీ" అని అరవడం విన్నాడు. ఆయన మనసు కరిగిపోయింది. అయితే ఆయన తాను స్వయంగా దిగి క్రిందకు పోలేడు. ఆయనకు పక్షవాతంవల్ల కాళ్ళు రెండూ పోయాయి. నోరు ఒక ప్రక్కకు తోసుకుపోవడంవల్ల మాట కూడా బయటికిరాదు. ఆయన కళ్ళలో నీళ్ళు నిండుతూ వుండగా తాను సంపన్నుడు కాకముందు చిన్నతనంలో పడిన కష్టాలను గుర్తుకు తెచ్చుకుంటూ అలాగేకూర్చుండిపోయాడు.

ఈలోపల క్రింద చిన్న తమాషా జరిగింది. వాడు పెట్టిన కేక లెవరికీ వినిపించివుండవు. ఎవరూ 'పొమ్మని' చెప్పనూ లేదు. పట్టెడు అన్నం తెచ్చి వెయ్యనూ లేదు. అయినా వాడక్కడనుంచి కదలలేదు. వీధి వాకిలిలోనుంచి లోపలకు తొంగి తొంగిచూస్తూ చేతిలో బొచ్చెతో అలాగే నిలబడివున్నాడు. వాడి కళ్ళలో ఇది అని చెప్పరాని విచిత్ర భావమేదో గూడుకట్టుకున్నది. విపరీతమైన ఉత్కంఠ ప్రజ్వలించే కళ్ళతో లోపలికి చూస్తున్నాడు. లోపల గచ్చుచేయబడిన నేలమీద దీపావళి బాణసంచాను ఎండబెట్టివుంచారు. ఎన్నోరకాల మందుసామానులు... లెక్కలేనన్ని వున్నాయి.

ఆ పసివాడు బజార్లలో కొట్లలోతప్ప మరెక్కడా అన్ని టపాకాయలు ఒక్కచోటవుండగా చూడలేదు. దీపావళి రెండురోజులేవుంది... ఈ ఇంట్లో పిల్లలు వీటన్నిటినీ ఆనాడు కాలుస్తారు కాబోలు!

వాడలా చూస్తూ నిలబడివుండగానే లోపలినుంచి చేతిబంతితో ఆడుకుంటూ మరొక అయిదారేళ్ళ కుర్రవాడు వరండాలోకి వచ్చాడు. బొద్దుగా పచ్చగా వున్నాడు. మల్లెపువ్వువంటి చలువ యిస్త్రీ చొక్కా లాగూ తొడుక్కుని వున్నాడు. ఇంట్లో నీడలో నడుస్తున్నప్పటికీ చక్కని బూట్లు తొడుక్కుని దొరబాబులా వున్నాడు. వాకిట నిలబడివున్న పసివాడు ఆ బూట్లుచూసి ముచ్చటపడ్డాడు. 'ఎంత ముద్దొస్తున్నాడో' అనుకున్నాడు. అప్పుడు వాడికి కాళ్ళు మాడటం ప్రారంభించాయి. వెంటనే తప్పుకుని గుమ్మంమీదుగా ప్రాకిన క్రీపరు నీడలో నిలబడ్డాడు.

లోపలినుంచి వచ్చిన పిల్లవాడు చేతిలోవున్న బంతి వరండా మెట్లమీదపడి దొర్లుకుంటూ క్రిందికి రాగా దాని వెంట పరుగెత్తివచ్చి దాన్ని మళ్ళీ చేతిలోకి తీసుకుని క్రీపరు నీడలో నిలబడివున్న నిర్భాగ్యుడివంక చూశాడు. అలాగే ఒక్క క్షణం నిశ్చలంగా చూసి నవ్వాడు. తర్వాత చెయ్యి వూపుతూ బంతిని చూపిస్తూ "లోపలికి రా ఆడుకుందాం" అన్నాడు.

వాడు ఆశ్చర్యపోయాడు. కాస్సేపు అనుమానంగా చూశాడు. తర్వాత తన చేతిలోవున్న గిన్నెను క్రీపరు పాదులోవుంచి నెమ్మదిగా ముందుకు నడిచివచ్చాడు. వరండా మెట్లెక్కి పైకి వచ్చాడు. చేతిలోవున్న బంతిని నేలమీద ఒకసారి విసిరి మళ్ళీ పట్టుకుని, ఆ ధనవంతుల పిల్లవాడు "నీ పేరేమిటీ?" అని అడిగాడు. వాడు మోచేతితో ముక్కు తుడుచుకుంటూ చిరుగుల లాగును మరొకచేతితో పైకి లాక్కుంటూ "కన్నడు" అన్నాడు.

"అదేం పేరు ? నా పేరు రాజేంద్ర. అనుగో గుమ్మం దగ్గర ఆడుకుంటున్నది చూడు... మా చెల్లి... దాని పేరు శకుంతల..." అన్నాడా ధనవంతుల అబ్బాయి. కన్నడు మనసులో "అబ్బ! వీళ్ళ పేర్లు ఎంత బాగున్నాయి !" అనుకున్నాడు. గుమ్మం అవతల రబ్బరు బొమ్మలతో ఆడుకుంటున్న పిల్ల చక్కని సిల్కు గౌను తొడుక్కుని అచ్చు రబ్బరుబొమ్మకు మల్లేనే వున్నది. కన్నడికి తమ గుడిసెలో దిసమొలతో, ఏదో జబ్బువల్ల ఉబ్బిన పొట్టతో, కోరింత దగ్గుతో, యిరవై నాలుగు గంటలూ "ఆకలి ఆకలి" అంటూ

ఏడ్చే తన చెల్లెలు రత్తి జ్ఞాపకం వచ్చింది. దాని కెప్పుడూ ఆకలే...

తర్వాత కొన్ని నిముషాలసేపు రాజేంద్రా, కన్నడూ బంతిఆట ఆడుకున్నారు. రాజేంద్ర బంతిని వరండాలో నుంచి విసరడం... కన్నడు వెంటనే పరుగెత్తుకువెళ్ళి దాన్ని అందుకుని రావటం... యిదీ ఆట... ఖరీదైన ఆ బంతిని ముట్టుకోవటమే కన్నడికి అపూర్వమైన అనుభవంగా వుండి, దాన్ని పట్టుకున్నప్పుడల్లా వాడి వొళ్ళు పులకరిస్తున్నది.

కొద్దిసేపు గడిచాక రెండో అంతస్థులో కూర్చునివున్న ముసలాయన ఆ ముష్టివాడి కేకలు వినిపించనందువల్ల "వాడు తన దోవను తాను వెళ్ళిపోయివుంటాడు లెమ్మ"ని కళ్ళు మూసుకుని విశ్రాంతిగా వాలుకుర్చీలో వెనక్కువాలాడు.

రాజేంద్ర బంతి అందుకుని "ఇకచాల్లే" అన్నాడు. కన్నడి ప్రాణం చివుక్కుమన్నది. "పోలిభోగం మొగుడు వూళ్ళో లేనన్నినాళ్ళే" అన్నట్టు వాడికి అపురూపమైన యీ బంతి ఆట కొన్ని నిముషాలలోనే అయిపోయింది. మళ్ళీ వాడి చూపులు దీపావళి బాణసంచామీదపడ్డాయి. "ఇవన్నీ మీవేనా?" అని అడిగాడు వాడు రాజేంద్రను. అతడు తల వూపి "అవును, అవన్నీ మావే. మా బావ బొంబాయినుంచి వొస్తాడు... అప్పుడివి చాలవు... ఇంకా కొనుక్కొనివస్తారు.... మా బావ బొంబాయినుంచి నాకోసం ఎన్నో బొమ్మలు తీసుకువస్తానని ఉత్తరంలో రాశాడు" అని చెప్పాడు. కన్న

డికి బొంబాయి ఎక్కడవున్నదో తెలియదు. కాని అక్కడ చాలా బొమ్మలుంటాయనీ కావలసినవాళ్ళు కావలసినన్ని బొమ్మలు వూరికే తెచ్చుకోవచ్చుననీమాత్రం అర్థంచేసు కున్నాడు. కాని ఆ వూరికి తనుగాని తన బావలూ మామలూగాని, ఎవరూ ఎప్పుడూ పోలేరు.

రాజేంద్ర "దీపావళికిగాను కొత్త లాగూచొక్కాలు కూడా వున్నాయ్. మా నాన్న నిన్ననే తెచ్చారు. వుండు.. చప్పుడు చెయ్యకుండా లోపలికివెళ్ళి తెచ్చిచూపిస్తాను. మా చెల్లి గౌన్లుకూడా..." అంటూ లోపలికి వెళ్లాడు.

రెండునిముషాల తర్వాత రెండుచేతులతోనూ తన లాగూ చొక్కాలనూ, చెల్లి గౌనులనూ గుండెల కదుము కుని తీసుకువచ్చి "ఇవిగో ఇవి నావి...ఎంచక్కా పండగ నాడు తలంటిపోసుకుని తొడుక్కుంటాను" అన్నాడు. కన్నడు ఆశ్చర్యంతో నోరు తెరిచాడు...ఆ లాగూ చొక్కాలు కళ్లు చెదిరిపోయేటంత బాగున్నాయి. అవి తనకుకూడా సరిపో తాయి. కాని ఆ గౌనుమాత్రం రత్తికి సరిపోదు...

రాజేంద్ర కన్నడి ఉత్కంఠను గమనించాడు...తర్వాత కన్నడు మందుసామానులవైపే చూస్తూవుండటం గమనించి-

"మీ ఇంట్లో టపాకాయలు అసలు లేవా?" అని అడిగాడు. కన్నడు తలవూపి "లేవు...మా నాన్న తీసుకు రాడు..." అన్నాడు.

వాడి నాన్న పచ్చి తాగుబోతు దమ్మిడీకూడా సంపా యించడు- ఇంట్లో దమ్మిడీ వుండనియ్యడు - వాళ్ళ అమ్మ

కలవారియిళ్లలో పనులుచేసి ఏ కొంచెమో తెస్తే ఆమెను నానాహింసలూపెట్టి ఆ డబ్బులుకాసినీ దులుపుకుపోతాడు. తాగుతాడు... జూదమాడుతాడు. కన్నడు ఎన్నోసార్లు "నేను పెద్దవాణ్నయాక చెబుతాను నాన్నపని" అనుకున్నాడు.

రాజేంద్ర "అన్నట్టు, నువ్వెప్పుడన్నా కీ యిస్తే పరిగెత్తే రైలుబండిని చూశావా?" అని అడిగాడు. కన్నడు కళ్ళు పెద్దవిచేసి "ఓ. మా గుడిసెల పక్కనుంచేగా రైలు రోజూ పోతూవుంటుంది. బోలెడన్నిసార్లు చూశాను. అయితే ఎప్పుడూ ఎక్కలేదు" అన్నాడు. రాజేంద్ర నవ్వి "ఆ రైలు కాదోయ్! ఆ రైలులో నేను ఎన్నోసార్లు ఎక్కానుకూడా! నేను చెప్పేది ఆట రైలుబండి. యీ పంచలో పరుగెత్తుతుంది. వుండు తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళాడు. కన్నడు ఉత్కంఠతో ఒక్కసారి తన దగ్గరలోవున్న సిల్కు లాగు బొక్కాలను ముట్టుకుని చూశాడు. తర్వాత టపాకాయల వైపు చూశాడు చిచ్చుబుడ్లను లెక్కపెట్టడం ప్రారంభించాడు. లెక్కపెట్టలేనన్ని వున్నాయి.

రాజేంద్ర లోపలినుంచి కీ ఇస్తే పరుగెత్తే రైలుబండిని తెచ్చాడు. పంచలో ఒకచోటవుంచి దానికి కీ యిచ్చి 'ఇటు చూడు' అంటూ వదిలిపెట్టాడు అది "గుర్రుమ"ని శబ్దం చేస్తూ పంచలో ఆ చివరివరకు పోయి ఆగిపోయింది. కన్నడు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేసిచూస్తూ చకితుడైపోయాడు. రాజేంద్ర మళ్ళీ దాన్ని వెనక్కు తీసుకువచ్చి "ఇటువంటిదే బస్సుకూడా ఉంది—చూస్తావా?" అంటూ లోపలికి వెళ్లాడు.

కన్నడలాగే కూర్చున్నాడు. వేడిగాలి తెరలు తెరలుగావచ్చి వుండివుండి ఆగిపోతున్నది. ఒక కాకి దాహంతో బాధపడుతున్నదికాబోలు టెలిగ్రాఫ్ స్తంభాలమీద వ్రాలి "కాకా" అని దీనంగా అరుస్తున్నది. ఒక నిముషం గడిచినా లోపలనుంచి రాజేంద్ర ఇవతలకు రాలేదు. కన్నడు తృష్ణ అంతా గూడుకట్టుకున్న కన్నులతో టపాకాయలవైపు చూశాడు. వాణ్ని మిగిలినవేవీ అంతగా ఆకర్షించలేదు. వాడి చెల్లెలు రత్తికి మాటలు బాగావచ్చు. దానికి టపాకాయలు కావాలి. గోలచేస్తున్నది. తానేమో తనతల్లి పని చేసే ఒక ఇంటివారిచ్చిన నాలుగైదు రంగు అగ్గిపుల్లలనూ పెన్నిధిలా దాచుకుని రోజు కొకటిచొప్పున కాల్చివేశాడు. ఇప్పుడొక నిండు అగ్గిపెట్టె వుంటే...

వాడు లేచి లోపలినుంచి రాజేంద్ర వస్తున్నాడేమోనని చూశాడు. ఆ సవ్వడి ఏమీ వినరాలేదు చుట్టుప్రక్కల ఆవరణలో ఎవరూ లేరు. రోడ్డుమీద అసలు జనమే నడవటం లేదు. ఆ కాకిమాత్రం ఏకాకిగా అలాగే నిలబడివుండి ఇంకా అరుస్తున్నది.

కన్నడు వున్నట్టుండి మెట్లుదిగి టపాకాయలలో నుంచి ఒక అగ్గిపెట్టెనుతీసి చిరుగు జేబులో దాచుకున్నాడు. దాన్ని జేబులో వుంచుకుని వెనక్కుచూసేసరికి రాజేంద్ర గుమ్మం దాటి వరండాలోకి రానేవచ్చాడు. వస్తూ "ఏం తీసుకున్నావందులోనుంచి ?" అని అడిగాడు. కన్నడికి ముచ్చెమటలు పోశాయి. వాడు త్వరత్వరగా యివతలి వీథిలోకి పరుగ

త్తాడు. వెనకనుంచి రాజేంద్ర "అమ్మా అమ్మా" అని కేకలు వెయ్యటం వాడికి వినిపించింది.

వాడిక వేగంగా వీధివెంట, చేతిలో గిన్నెతో బాణం వలె పరుగెత్తటం ప్రారంభించాడు. వీధి మలుపు తిరిగితే అసలు భయమేలేదు. కాని వాడివెంట రాజేంద్ర పిలుపులకు లేచిన నౌకరు పరుగెత్తుకొస్తున్న సంగతి వాడికి తెలియదు. మలుపు రానేవచ్చింది. వాడు తలవంచుకుని వేగంగా పరుగెత్తుతూ మలుపుతిరిగి ఎదురుగా నడిచివస్తున్న ఒక మనిషిని ఢీకొన్నాడు. గింగిరాలు తిరుగుతూ నేలమీద దొర్లిపోయాడు. వాడిచేతిలోని గిన్నె ఎర్రమట్టిలో పడిపోయింది.

వాడివెంట పరుగెత్తివచ్చిన నౌకరు వాడిచేతిని గట్టిగా పట్టుకుని లేవదీసి 'దొంగవెధవా!' అంటూ వీపు మీద నాలుగు తగిలించాడు. వాడు వొణికిపోవటం ప్రారంభించాడు. తర్వాత కన్నడు ఢీకొన్న మనిషి చేతిలోని గొడుగును ముడిచిపట్టుకుని "ఏమిటయ్యా?" అని వాకబుచేయగా నౌకరు అంతాచెప్పి ఏమేమి దొంగిలించుకుని వస్తున్నాడో అని లాగూజేబులు వెతికితే అగ్గిపెట్టె ఒకటి కనిపించింది. ఆ పెద్దమనిషి వాణ్ణి విడదీసి "పోనివ్వులే పాపం! పసివాడు తెలియక చేసివుంటాడు" అన్నాడు. నౌకరు అగ్గిపెట్టె తీసుకుని "తెలియక కాదండీ ఏదిదొరికితే అది చేతబట్టుకుని పోవడమే వీళ్ళపని. మీరు చెప్పారుగాబట్టి వొదలిపెడుతున్నాను-లేకపోతే వెనక్కు తీసుకుపోయి పందిరిగుంజకు కట్టి బాదేవాణ్ని" అంటూ నసుగుతూ వెళ్ళిపోయాడు. ఇంటికి వెళ్ళి

పైనకూర్చునివున్న ముసలాయనకు అంతాచెప్పి ఆ అగ్గిపెట్టె చూపించాడు. ముసలాయన ఏదో అవ్యక్తమైన బాధతో గిలగిలలాడిపోయాడు.

ఆ పెద్దమనిషికూడా వెళ్ళిపోగానే కన్నడు తేరుకుని కళ్ళు తుడుచుకుని తన గిన్నెకోసం చూసుకున్నాడు. అది కొద్దిదూరంలో ఎర్రమట్టిలో పడివున్నది. వాడు దాన్ని అందుకుని చూస్తే ఒక్క మెతుకుకూడా లేదు. అంతకు మునుపువున్న పట్టెడన్నమూ మట్టిపాలయింది. ఇంతసేపటి నుంచీ తెలియని ఆకలి మళ్ళీ వేయిరెట్లుగా విజృంభించి వాణ్ని బాధపెట్టడం ప్రారంభించింది. వాడు కళ్ళు మాటి మాటికీ తుడుచుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ మళ్ళీ ఎదురుగా కనిపించిన గుమ్మంముందు నిలబడి నీరసస్వరంతో "తల్లీ! ఒక్క కబళం వెయ్యిమాతా?" అని అరిచాడు. లోపలనుంచి "వెళ్లు, వెళ్ళు" అని సమాధానం రాగానే మరొక గుమ్మం ముందుకు కదిలాడు దూరాన పై అంతస్థులో కదలలేక మెదలలేక కూర్చునివున్న ముసలాయన హృదయం ఆక్రోశించింది.

తీక్షణంగా జ్వలిస్తూ నిప్పులు కురిపిస్తున్న ఓ సూర్యుడా! ఆ నిర్భాగ్యుడసలే నీరసపడి వున్నాడు. వాణ్ని యింకా బాధపెట్టకు. ఓరిమిగల మహాతల్లీ! భూదేవీ! ఆ పసి పాదాలు యిప్పటికే బొబ్బలెక్కివున్నాయి. వాటిని ఇంకా మాడ్చకు — విసురుగా వీస్తూ సమస్త జీవరాసులచేత "ఉస్సుర" నిపించే వేడిగాలీ! ఈ పసివాడసలే ఉసూరు

మంటున్నాడు. వాణ్ణి యింకా క్షోభపెట్టకు. రాయివై పూజలందుకుంటూ లోకరక్షణభారం వహించిన ఓ భగవంతుడా! పట్టెడన్నం దొరకని యీ పసివాడి కన్నీరు మహా ప్రవాహమై యీ భువిని ముంచి వేస్తుందేమో జాగ్రత్త! వాడి క్షుధాగ్నిజ్వాలలు యీ ప్రపంచాన్ని దగ్ధంచేస్తాయేమో జాగ్రత్త!!

ముందు జాగ్రత్తలోవుంటే ఎందుకైనా మంచిది!

## మళ్లీ మొదలైన కథ

“కాలవకు కొత్త నీళ్ళొచ్చినట్టున్నాయి” అనుకున్నాడు మల్లన్న గాలం నీళ్ళలోకి విసురుతూ... “ఇంక కావలసినన్ని చేపలు... రకరకాల చేపలు...”

ఉదయం ఎనిమిది గంటల వేళ... కాలవలో వరదనీరు వేగంగా ప్రవహిస్తున్నది. సూర్యుని ఎర్రని కిరణాలు నీటి ప్రవాహానికి రకరకాల రంగులు పూస్తున్నాయి. చిన్న చిన్న తరంగాలతో ప్రవాహం ఒకచోట బురదపాములు కదలాడుతున్నట్టూ, మరొకచోట ఎర్రని కాంతులవల్ల రక్తపింజరులు పొరలుతున్నట్టూ కనిపిస్తున్నది.